సీఎం సహాయ నిధి మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఆరోగ్యానికి ఆర్థిక భరోసా సీఎం సహాయ నిధి

మియాపూర్, ఏప్రిల్ 8: నిరుపేదల ఆరోగ్యానికి సీఎం సహాయ నిధి అతి పెద్ద ఆర్థిక భరోసాగా నిలుస్తున్నదని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. హఫీజ్‌పేట్ డివిజన్ మదీనాగూడకు చెంది శ్రీనుకు అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి పథకం ద్వారా రూ.1.50ల క్షల నిధుల మంజూరు పత్రాలను కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో కలిసి సోమవారం తన నివాసంలో బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే గాంధీ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదరికం కారణంగా ఏ ఒక్కరూ అనారోగ్యాలతో మూలకు పడకూడదనే సత్సంకల్పంతో సీఎం సహాయ నిధి పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నదన్నారు. ఈ పథకం సాయంతో కార్పొరేట్ దవాఖానల్లో ఉచితంగా వైద్యం పొంది తమ అనారోగ్యాలను దూరం చేసుకుంటున్న వారి సంఖ్య వేలల్లో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాధవరం రంగారావు, నాయినేని చంద్రకాంత్‌రావు పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి సహకరిస్తా..

కొండాపూర్ డివిజన్ శ్రీరామ్‌నగర్ కాలనీ ఏ బ్లాక్‌కు నూతనంగా ఎన్నికైన సంక్షేమ సంఘం ప్రతినిధులు సోమవారం ఎమ్మెల్యే గాంధీని కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు శివకుమార్, ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్‌రెడ్డి, వెంకటేశ్వర్ రావు, చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, కార్యనిర్వహక అధ్యక్షుడు మేడిశెట్టి రాము, సంయుక్త కార్యదర్శి నర్సింహారెడ్డి, సభ్యులు నారాయణమ్మ, వసంత, మనోజ్, గురుమూర్తి, మహేందర్ సింగ్, ధనుంజయ, పుల్లయ్య, రాజగోపాల్, సోమయ్య, జంగారెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీనివాస్, వాణి, ప్రసాద్, సుధ, తిరుపతి, విజయ్ పాల్గొన్నారు.

సకల శుభాలు కలగాలి

మియాపూర్, ఏప్రిల్ 8 : శేరిలింగంపల్లి నియోకవర్గ ప్రజలకు క్రోధి నామ నూతన సంవత్సరంలో సకల శుభాలు కలగాలని.. అందరి ఆకాంక్షలు నెరవేరాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఆకాంక్షించారు.

ఇఫ్తార్ విందులో ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కార్పొరేటర్ సబీహాబేగంతో ఇఫ్తార్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న రాగిడి రజిని

ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీక

అల్లాపూర్, ఏప్రిల్ 8: ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధి కేఎస్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి సతిమణి రాగిడి రజిని, స్థానిక కార్పొరేటర్ సబీహాబేగం హాజరయ్యారు. ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సోదర భావంతో దేశానికి మన రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ప్రజలంతా కలిసి మెలిసి జీవించాలన్నారు. అందరి సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించుకోవాలని సూచించారు. రాగిడి రజిని మాట్లాడుతూ.. పదేండ్ల హైదరాబాద్ కీర్తిని ప్రపంచ స్థాయిలో తీర్చిదిద్దిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి తన భర్త రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ గౌసుద్దీన్, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, రహీం, తదితరులు పాల్గొన్నారు.

హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని యూత్ కాలనీలో షాబాన అధ్వర్యంలో దవాత్ ఏ ఇఫ్తార్ విందులో పాల్గొన్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు. – మాదాపూర్, ఏప్రిల్ 8

ఎల్లమ్మబండ ఈద్గా మైదానంలో కాంగ్రెస్ నేత అనీల్‌రెడ్డి నేతృత్వంలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి తనయుడు గడ్డం ఆర్యన్‌రెడ్డి, రాజేశ్‌రెడ్డి, కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్, సిద్ధార్థరెడ్డి. – మియాపూర్, ఏప్రిల్ 8

వేంకటేశ్వరస్వామి దేవాలయంలో 'కవి సమ్మేళనం'

కొండాపూర్, ఏప్రిల్ 8: క్రోధినామ సంవత్సరాన్ని పురస్కరించుకొని చందానగర్‌లోని విశాఖ శారదా పీఠ పాలిత వేంకటేశ్వరస్వామి దేవాలయ సముదాయంలో సోమవారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్కిటెక్ట్ యెండూరి సురేశ్ బాబు సౌజన్యంతో కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సుదర్శన సత్యసాయి జ్యోతి ప్రదీపన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆచార్య వంగర త్రివేణి ముఖ్య అతిథిగా హాజరై కవి సమ్మేళనంలో పాల్గొన్న 60 మంది కవి పుంగవులను శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య బాశెట్టి లత, చిత్రకవితా సామ్రాట్ చింతా రామకృష్ణారావు, అవధాని ములుగు అంజయ్య, కటకం వెంకటరావు శర్మ, హాస్య బ్రహ్మ శంకరనారాయణ, తాడిబోయిన రామస్వామి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి

మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి దంపతులకు వినతి పత్రం అందజేస్తున్న 4వ డివిజన్ సంక్షేమసంఘం ప్రతినిధులు

దుండిగల్, ఏప్రిల్ 8: వేసవిలో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కోలన్ నీలా గోపాల్‌రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. కార్పొరేషన్ పరిధిలోని 4వ డివిజన్‌కు చెందిన సంక్షేమసంఘం సభ్యులు, స్థానిక నాయకులు సురేంద్ర కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో మేయర్ దంపతులను బాచుపల్లి హిల్‌కౌంటీలోని వారి నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ ప్రాంతంలో నెలకొన్న తాగునీటి ఇబ్బందులను వివరించడంతో పాటు నీటి సరఫరా సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. స్పందించిన మేయర్ జలమండలి అధికారులకు ఫోన్‌చేసి మాట్లాడారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 4వ డివిజన్ వేల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, స్థానికులు, వివిధ కాలనీలకు చెందిన ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



తాళం పగుల గొట్టి ఇంట్లో చోరీ

జగద్గిరిగుట్ట, ఏప్రిల్ 8: ఇంటి తాళం పగుల గొట్టి చోరీ చేసిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట డివిజన్ భూదేవిహిల్స్‌లో నివాసముండే నరేందర్, వెంకటలక్ష్మి దంపతులు ఈనెల 3న నర్సాపూర్‌లోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లి తిరిగి ఆదివారం సాయంత్రం ఇంటికి రాగా తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉండాల్సిన రూ.లక్ష చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

మియాపూర్, ఏప్రిల్ 8 : తాళం వేసిన ఇండ్లలో చోరీలకు పాల్పడుతూ బంగారం నగదు దొంగిలిస్తున్న ఓ గజ దొంగను మియాపూర్ పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు దొంగ నుంచి వాటిని రికవరీ చేసుకున్నారు. చోరీలకు సంబంధించిన వివరాలను మియాపూర్ సీఐ దుర్గారామలింగ ప్రసాద్ సోమవారం తెలిపారు. మీర్ కాజం అలీ ఖాన్ షేక్‌పేట్ టోలిచౌకీ ప్రాంతంలో నివసిస్తూ హోటల్ నిర్వహిస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడ్డ మీర్ కాజం ఖాన్ అధిక డబ్బులు సంపాదించేందుకు చోరీలను ప్రారంభించాడు. గత నెల 22న మియాపూర్ ఠాణా పరిధిలోని ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీలో మువ్వ సాయి కృష్ణ భార్య కూతురు విజయవాడకు వెళ్లగా.. సాయికృష్ణ ఆఫీసు పనిపై అదే రోజు ఉదయం 8 ముంబాయికి వెళ్లి.. రాత్రి 11.15 గంటలకు ఇంటికి చేరుకున్నాడు. అప్పటికే వంట గది తలుపు పగుల గొట్టి ఉండటాన్ని గుర్తించాడు. లోపల ఇనుప బీరువా తెరిచి ఉంచటంతో పాటు అందులో దాచుకున్న 100 గ్రాముల 4 బంగారు బిస్కెట్లు, రూ.50వేల నగదుతో పాటు బంగారు చెవి రింగులు చోరీకి గురైనట్లు గుర్తించాడు. వెంటనే మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మాదాపూర్ సీసీఎస్ పోలీసుల సాయంతో మియాపూర్ పోలీసులు చోరీ ఘటనపై విచారణ జరిపి.. చోరీకి పాల్పడ్డ మీర్ కాజం అలీ ఖాన్‌ను పట్టుకున్నారు. నిందితుడి నుంచి 36 తులాల బంగారు ఆభరణాలు, కారు, రెండు ద్విచక్ర వాహనాలు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై నగరంలోని పలు కమిషరేట్ల పరిధిలో 88 కేసులున్నట్లు సీఐ దుర్గాప్రసాద్ తెలిపారు. మియాపూర్ సీఐ నర్సింహారావు నేతృత్వంలో సీసీఎస్ పోలీసుల సాయంతో కేసును ఛేదించినట్లు సీఐ పేర్కొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

దుండిగల్, ఏప్రిల్ 8: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, బహదూర్‌పల్లిలోని కల్పవృక్ష అస్పిరేషనల్ హోమ్స్ నిర్మాణ సంస్థకు చెందిన లేబర్‌క్యాంపు వద్ద సుమారు 58 ఏండ్ల వయస్సున్న గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు సోమవారం పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడి వివరాల కోసం ప్రయత్నించగా ఎటువంటి సమాచారం లభించలేదు. అనారోగ్య సమస్యలతో మరణించి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు శవాన్ని గాంధీవైద్యశాల మార్చురీకి తరలించారు.

వాకిటిరాంరెడ్డికి సాహితీ పురస్కారం

జగద్గిరిగుట్ట, ఏప్రిల్ 8: రంగారెడ్డినగర్‌కు చెందిన ఆత్మీయభారతి సేవాసంస్థ అధ్యక్షుడు వాకిటి రాంరెడ్డి ఉగాది పురస్కారం పొందారు. నూతన తెలుగు సంవత్సర నేపథ్యంలో యాదాద్రి జిల్లా రచయితల ఆధ్వర్యంలో సోమవారం రాయగిరిలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనను సన్మానించి బహుమతి అందించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు కూరెళ్ల విఠలాచార్య, ఎన్.గోపి, వెంకటరెడ్డి, కస్తూరి లక్ష్మీనారాయణ, అమరేందర్ పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ జగన్

జగద్గిరిగుట్ట, ఏప్రిల్ 8: పేదలకు ఉపయోగపడేలా సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని కార్పొరేటర్ జగన్ అన్నారు. జగద్గిరిగుట్ట మైసమ్మనగర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, స్థానికులు పాల్గొన్నారు.

అర్చన హాస్పిటల్‌లో అరుదైన చికిత్స

మహిళ కడుపులో 10 కేజీల క్యాన్సర్ గడ్డ తొలగించిన వైద్య సిబ్బంది

మాదాపూర్, ఏప్రిల్ 8: కడుపు నొప్పి, కడుపు ఉబ్బరంతో నొప్పి భరించలేక దవాఖానకు వచ్చిన మహిళను వైద్యులు పరీక్షలు చేయగా.. ఆమెకు తెల్లరక్త కణాలు తక్కువగా ఉండటంతో పాటు కడుపులో 10 కేజీల గడ్డ ఉందని తేలింది. దీంతో అర్చన హాస్పిటల్ వైద్యులు మహిళకు చికిత్స చేసి క్యాన్సర్ గడ్డను తొలగించారు. ఈ నేపథ్యంలో మదీనాగూడలోని అర్చన హాస్పిటల్‌లో డాక్టర్ యశస్వి వైద్య బృందంతో కలిసి సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హైదరాబాద్‌కు చెందిన రేష్మ ఏడాది నుంచి కడుపు నొప్పి, కడుపు ఉబ్బరంతో బాధపడుతుంది. దీంతో తీవ్ర నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆమెను మదీనాగూడలోని అర్చన హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. హాస్పిటల్‌లో అడ్మిషన్ అనంతరం తీవ్ర రక్తస్రావం రావడం మొదలయ్యింది. వైద్యులు ఆమెకు పరీక్షలు చేయగా ఆమె రక్తంలో తెల్లరక్తకణాలు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. వైద్యులు సిటీ స్కాన్ చేసి చూడగా ఆమె కడుపులో 10 కేజీల గడ్డ ఉన్నట్లు గుర్తించారు. హెచ్‌బీ లెవల్స్ తక్కువగా ఉండటంతో 5 లీటర్ల రక్తం ఎక్కించారు. అనంతరం గడ్డని తొలగించి ల్యాబ్ పంపించి పరీక్షలు జరుపగా వారం రోజుల తరువాత రిపోర్టు రాగా అందులో క్యాన్సర్ గడ్డ అని తేలింది. దీంతో వైద్యులు మహిళకు చికిత్స చేసి నయం చేయడం జరిగింది. ఇందులో పలువురు వైద్య సిబ్బంది ఉన్నారు.

వివరాలను వెల్లడిస్తున్న అర్చన హాస్పిటల్ వైద్య సిబ్బంది

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 8: బాలాజీనగర్ డివిజన్‌లోని జేఎన్ఎన్‌యూఆర్ఎం గృహాలలో మోబిస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి మంచి స్పందన లభించింది. పేద ప్రజలకు ఉచితంగా ఆర్యోగ్య పరీక్షలు నిర్వహించి.. పలు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించి.. ముందస్తు జాగ్రత్తలను వివరించారు. కాలనీలో ప్రతి పదిహేను రోజులకు ఒకసారి ఉచిత వైద్యశిబిరం కొనసాగుతుందని.. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో డాక్టర్ రోహిత్ జైస్వాల్, పంకజ్, ఫారూక్ తదితరులు ఉన్నారు.

టెక్ మహీంద్రాలో ఓటరు అవగాహన

మియాపూర్, ఏప్రిల్ 8 :ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని టెక్ మహీంద్రాలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థలో పని చేసే వందలాది ఐటీ ఉద్యోగుల చేత పార్లమెంట్ ఎన్నికల్లో తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. నియోజకవర్గ ఏఆర్‌వో స్నేహ ఆదేశాల మేరకు నియోజకవర్గ ఈఆర్‌వో రజనీకాంత్ రెడ్డి ఇతర అధికారులు ఇందులో పాల్గొన్నారు.

ఈనెల 10న 5కే రన్

సిటీబ్యూరో, ఏప్రిల్ 8(నమస్తే తెలంగాణ): ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరిస్తూ ఓటర్లలో అవగాహన పెంపొందించేందుకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా శేరిలింగంపల్లి జోన్‌లో ఈనెల 10న ''నేను తప్పకుండా ఓటు వేస్తాను'' ''ఐ ఓట్ ఫర్ ష్యూర్'' అనే నినాదంతో 5కే రన్ నిర్వహిస్తున్నట్లుగా జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు. ఏప్రిల్ 10న ఉదయం 6గంటలకు 5కే రన్ కొండాపూర్ బొటానికల్ గార్డెన్స్ నుంచి హైటెక్స్ రోడ్, మెటల్ చార్మినార్ వరకు సాగుతుందన్నారు. అన్ని వర్గాల వారు స్వచ్ఛందంగా 5కే రన్‌లో పాల్గొని ప్రజాస్వామ్య పరిణతి చాటాలని, వివిధ శాఖల అధికారులతోపాటు డ్వాక్రా సంఘాల ప్రతినిధులు, విద్యార్థినీ,విద్యార్థులు, యువతీ యువకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బీఆర్ఎస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా అర్పితప్రకాశ్

ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న అర్పితాప్రకాశ్

దుండిగల్, ఏప్రిల్ 8: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా ప్రగతినగర్‌కు చెందిన అర్పితాప్రకాశ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎమ్మెల్యే వివేకానంద్ ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు.

నగదు, చెక్కును అందజేస్తున్న నవద్వీప ఫౌండేషన్ ప్రతినిధులు

విద్యార్థికి ఆర్థిక సాయం

కొండాపూర్, ఏప్రిల్ 8 : పేద విద్యార్థి ఇంజినీరింగ్ కాలేజీ ఫీజుల నిమిత్తం అవసరమైన మొత్తాన్ని హైటెక్ సిటీలో మైహోం నవద్వీప ఫౌండేషన్ ఆర్థిక సాయాన్ని అందజేసింది. విజ్ఞాన భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో చివరి ఏడాది చదువుతున్న విద్యార్థిని కాలేజీ ఫీజులు కట్టలేక ఇబ్బందులు పడుతున్న విషయం తమ దృష్టికి రావడంతో వెంటనే స్పందించి, ఫీజు మొత్తాన్ని విద్యార్థిని తండ్రి ప్రకాశ్‌కు అందజేసినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ తెలిపారు. కాగా ఫౌండేషన్ సభ్యుడు వీ.రమేశ్ రూ.25వేలను అందజేయడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థిని చదువులకు అవసరమైన రూ.75 వేలను ఫౌండేషన్ సభ్యుల చేతుల మీదుగా అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నవద్వీప ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఉగాది సంబురాలు

శ్రీసాయి విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో ఉగాది పచ్చడితో విద్యార్థినులు, ఉపాధ్యాయులు

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 8 : బాలాజీనగర్ డివిజన్ ప్రగతినగర్‌లోని సాయి విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో ఉగాది వేడకలు ఘనంగా జరిగాయి. సోమవారం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి ఉగాది పచ్చడిని తయారుచేసి విద్యార్థిని, విద్యార్థులకు పంపిణీ చేశారు.

నార్త్‌సిటీ పాఠశాలలో..

దుండిగల్: నార్త్‌సిటీ పాఠశాలలో ఉగాది సంబరాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. యూకేజీ, ఎల్‌కేజీ చదువుతున్న చిన్నారులు తమ నృత్యాలతో అలరించారు.

కాంగ్రెస్ గెలుపు కోసం పనిచేయాలి: పట్నం మహేందర్‌రెడ్డి

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 8 : మల్కాజిగిరి పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పనిచేయాలని కూకట్‌పల్లి సీనియర్ నాయకుడు గొట్టిముక్కల పద్మారావును కాంగ్రెస్ పార్టీ నాయకుడు పట్నం మహేందర్‌రెడ్డి కోరారు. సోమవారం కూట్‌పల్లిలోని పద్మారావు నివాసానికి పట్నం మహేందర్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు వెళ్లి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. దీనికి పద్మారావు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీ మూడు నెలల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేసిందని.. పేదలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీలో పనిచేసే నాయకులకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ స్థానాలను కైవసం కేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గం మాజీ అధ్యక్షుడు శేరి సతీశ్‌రెడ్డి, కొప్పిశెట్టి దినేశ్‌కుమార్, మేకల మైకల్, దుర్గారాణి, పలువురు నాయకులు పాల్గొన్నారు.